
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
3



అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

ఆదివారం 28 జనవరి 2024

లేబర్ సెస్‌ను విధిగా వసూలు చేయాలి

- అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- ఒక శాతం సెస్‌ను లేబర్ వెల్ఫేర్ బోర్డుకు జమ చేయాలని సూచన

- వార్త 6వ పేజీలో..



వైసీపీ ఫ్లాప్ షో

తేలిపోయిన తొలి ఎన్నికల సభ

- 'సిద్ధం' పేరుతో భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలసలో నిర్వహణ



అభివాదం చేస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి



సంగివలసలో నిర్వహించిన సభలో సీఎం జగన్ ప్రసంగిస్తున్న సమయంలో ఖాళీగా ఉన్న ప్రాంగణం

- మూడు వారాల నుంచి కసరత్తు
- నియోజకవర్గాల్లో సమావేశాలు
- మూడు లక్షల మందిని సమీకరిస్తున్నట్టు నాయకుల ప్రకటనలు
- 30 వేలకు మించి హాజరుకాని ప్రజలు, కార్యకర్తలు
- వెయ్యికిపైగా ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు ఏర్పాటు
- అయినా ఫలితం శూన్యం
- అనేక గ్రామాలకు వెళ్లిన బస్సుల్లో ఐదారుగురికి మించి రాని వైనం
- జగన్ ప్రసంగానికి కేడర్ నుంచి స్పందన కరవు
- ఆయన ప్రసంగం ప్రారంభించగానే బయటకు క్యూ కట్టిన జనం

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీ భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలసలో శనివారం నిర్వహించిన తొలి ఎన్నికల సభ తేలిపోయింది. ఈ సభను మూడు లక్షల మందితో నిర్వహించబోతున్నామంటూ వైసీపీ నాయకులు ప్రకటిస్తూ వచ్చారు. సభ కోసం మూడు వారాల ముందు నుంచే ఉత్తరాంధ్ర నాయకులు కసరత్తు ప్రారంభించారు. ఆ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ, తదితరులు ఉమ్మడి జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి కనీసం వంద మంది చొప్పున, నియోజకవర్గానికి పది వేల మందికి తక్కువ కాకుండా తరలించాలని ఎమ్మెల్యేలు/సమన్వయకర్తలను ఆదేశించారు. ఇందుకోసం అంగ, అర్థ, అధికార బలాన్ని వినియోగించారు. ఇన్ని చేసినప్పటికీ సభకు గట్టిగా 30 వేల మందికి మించి తీసుకురాలేకపోయారు. సభా ప్రాంగణం జనం లేక వెలవెలబోయింది.

జాతీయ రహదారికి ఆనుకుని సంగివలస వద్ద 14 ఎకరాల్లో ఈ సభను ఏర్పాటుచేశారు. ఇందులో 12 ఎకరాల్లో మాత్రమే సభను నిర్వహించారు. వైసీపీ నాయకులు చెప్పినట్టు మూడు లక్షల మందితో సమావేశాన్ని నిర్వహించేందుకు అవకాశం లేదు. గట్టిగా 60 వేల మంది వచ్చినా ఈ ప్రాంగణం కిక్కిరిసిపోతుంది. కానీ, జనాలు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ప్రాంగణంలో దాదాపు ... మిగతా 5వ పేజీలో

విశాఖ ఊసే లేదు

- ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కూడా మౌనం
- అభ్యర్థులపై కూడా స్పష్టత ఇవ్వని వైసీపీ అధినేత
- నేతల్లో విస్మయం

- 5లో



సీఎం సభకు బస్సులు.. జనానికి తప్పని అవస్థలు

ఏజెన్సీలో 22 రూట్లలో బస్సు సర్వీసులు రద్దు

- ఆయా మార్గాల్లో ప్రయాణికుల ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గం పరిధి సంగివలసలో వైసీపీ ఎన్నికల శంఖారావం సభకు స్థానిక పీటీడీ డిపో నుంచి అధిక సంఖ్యలో బస్సులు తరలించడంతో శనివారం ఏజెన్సీలోని ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రజల ప్రయాణాల సంగతి కనీసం పట్టించుకోకుండా కేవలం తమ పార్టీ సభకు మాత్రమే ప్రాముఖ్యత ఇస్తూ స్థానిక డిపోలో మొత్తం 45 బస్సుల్లో 22 బస్సులను జగన్ సభకు తరలించారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాడేరు పీటీడీ బస్ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

సీఎం జగన్ సభకు బస్సులను తరలించడంతో ఏజెన్సీలో మారుమూల ప్రాంతాలకు చెందిన బస్సు సర్వీసులే అధికంగా రద్దయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన జనం రాకపోకలకు అవస్థలు పడ్డారు. ఏజెన్సీలో చింతపల్లి మండలం మూలకొత్తూరు, జోలాపుట్టు, కొయ్యూరు మండలం మంప, అరకులోయ, ముంచంగిపుట్టు మండలం డుడుమ, పెదగూడ, కుమడ, అనంతగిరి మండలం వేంగడ, జి.మాడుగుల మండలం మద్దిగరువు, గెమ్మెలి, హుకుంపేట మండలం బాకూరు, చింతపల్లి ప్రాంతాలతో పాటు పాడేరు నుంచి చోడవరం వెళ్లే సర్వీసును సైతం రద్దు చేశారు. దీంతో ప్రధానంగా జి.మాడుగుల, కొయ్యూరు, జీకేవీధి, ముంచంగిపుట్టు, హుకుంపేట మండలాల్లోని మారుమూల ప్రాంతాలకు వున్న బస్సు సర్వీసుల రద్దు కారణంగా ఆయా మారుమూల ప్రాంత గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. ప్రధాన మార్గాలైన అరకులోయ, చోడవరం వంటి రూట్లలో బస్సులు రద్దయినా ప్రైవేటు జీపులు అందుబాటులో వుంటాయి. కానీ మారుమూల ప్రాంతాలకు ఎటువంటి రవాణా సదుపాయాలు లేకపోవడం, వున్న ఒక్క బస్సు సర్వీసు రద్దు కావడంతో అవస్థలు తప్పలేదు. ఇకనైనా అధికార పార్టీ సభలకు ఏజెన్సీ ప్రాంతం నుంచి బస్సుల తరలింపును నిలుపుదల చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పర్యాటకుల సందడి



బొర్రా గుహలు వద్ద పర్యాటకులు

అరకులోయ, జనవరి 27: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు శనివారం సందర్శకులతో కిటకిటలాడాయి. అనంతగిరి మండలం బొర్రా గుహలు, అరకులోయలోని పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం పర్యాటకుల తో పోటెత్తాయి. వీకెండ్ కావడంతో దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. మాడగడ సన్‌రైజ్ హిల్స్‌ను ఆదివారం వేకువజామున సందర్శించాలన్న ఉద్దేశంతో శనివారం సాయంత్రానికి అరకులోయకు చేరుకున్నారు. అరకులోయ ఘాట్‌రోడ్డు, సుంకరమెట్ట కాఫీ తోటలు, గాలికొండ వ్యూపాయింట్ వద్ద సందర్శకులు ప్రకృతి అందాలను తమ కెమెరాల్లో బంధించారు.



చాపరాయి వద్ద సందర్శకులు

చాపరాయి వద్ద..

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జల విహారికి శనివారం అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సరదాగా గడిపారు. గిరిజన సంప్రదాయ నృత్యం థింసా కళాకారులతో కలిసి నృత్యాలు చేశారు. జలవిహారిలో ఏర్పాటు చేసిన గార్డెన్‌లో ఎంజాయ్ చేశారు.

ప్రాధాన్యతా భవనాలు పూర్తయ్యేదెన్నడో?

నాలుగేళ్లు గడిచినా పూర్తికాని నిర్మాణాలు

- ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోడంతో నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- అసంపూర్తిగా దర్శనమిస్తున్న ఆర్‌బీకేలు, సచివాలయాలు, హెల్త్ సెంటర్ల భవనాలు

చింతపల్లి, జనవరి 27:

రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతా భవనాలుగా చెప్పుకుంటున్న రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలు మండలంలో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పనులు ప్రారంభించి నాలుగేళ్లు గడిచినా వైసీపీ ప్రభుత్వం నిర్మాణాలు పూర్తి చేయలేని దుస్థితిలో ఉంది. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని తెలిసింది. శాశ్వత భవనాలు అందుబాటులోకి రాక ప్రత్యామ్నాయ భవనాల్లో పలు సమస్యలను ఎదుర్కొంటూ సచివాలయం ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.



అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్న చౌడుపల్లి ఆర్‌బీకే భవనం

మేజర్ పంచాయతీలను రెండు, మూడు గ్రామ సచివాలయాలుగా విభజించారు. ఒక్కో గ్రామ సచివాలయం పరిధిలో 11 మంది ఉద్యోగులను కేటాయించారు. గ్రామ సచివాలయం భవనంలో వివిధ స్థాయి ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు ప్రత్యేక విభాగాలను రూపొందించారు. గ్రామ సచివాలయానికి అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలను హార్టికల్చర్, అగ్రికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్లు, హెల్త్ సెంటర్లను ఏఎన్‌ఎంలు నిర్వహించేలా ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయం పరిధిలో పరిపాలన పూర్తి స్థాయిలో నిర్వహించాలంటే శాశ్వత భవనాలను నిర్మించాలని, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లకు నూతన భవనాల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. వీటిని ప్రాధాన్యతా భవనాలుగా ప్రభుత్వం గుర్తించి తొమ్మిది నెలల్లో పూర్తి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసింది. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిధులకు ఢోకా లేదని ఇంజనీరింగ్ అధికారులు ఒప్పించి పనులు ప్రారంభింపజేశారు. తొలి బిల్లును ప్రభుత్వం నిర్మాణాలు ప్రారంభించిన నెల, రెండు నెలల్లో చెల్లించింది. అయితే ప్రస్తుతం ఏడాది కాలంగా సిమెంట్ సరఫరాను నిలిపివేసింది. ఏడు నెలలుగా నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు చెల్లించడం లేదు. ఒక్కో కాంట్రాక్టరు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు పెట్టుబడులు పెట్టి బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు. ఇక అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టలేక కాంట్రాక్టర్లు ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను ప్రస్తుతం నిలిపివేశారు.

బిల్లులు విడుదలకాక వెనకడుగు

రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు, ఆర్‌బీకే భవనానికి రూ.21.8 లక్షలు, హెల్త్ సెంటర్‌కు రూ.20.5 లక్షలు చొప్పున నిధులు కేటాయించింది. వీటి నిర్మాణ బాధ్యతలు పొందిన కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు 30-50 శాతం బిల్లులు మాత్రమే అందాయి. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోయినా అధికారుల ఒత్తిడి కారణంగా మరో రూ.10 లక్షల వరకు సొంత డబ్బులు పెట్టుకున్నారు. అయితే రెండో విడత బిల్లులు విడుదలకాకపోవడం వల్ల భవనాలు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు.

50 శాతం భవనాలు మాత్రమే పూర్తి

మండలంలో నాలుగేళ్లలో కేవలం 50 శాతం మాత్రమే ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలు జరిగాయి. మండలంలో 48 ప్రాధాన్యతా భవనాల్లో ఇప్పటికి 17 మాత్రమే పూర్తి చేశారు. చింతపల్లిలో 22 గ్రామ సచివాలయాలకు గాను 10, ఆర్‌బీకే భవనాలు 17కి గాను 5, హెల్త్ సెంటర్లు 7కి రెండు మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన భవనాలు అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది.



అర్ధాంతరంగా నిలిచిపోయిన చింతపల్లి-3 (అంతర్ల) గ్రామ సచివాలయం

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

చింతపల్లిలోని అంబేడ్కర్(ఎస్సీ)కాలనీలోని 200 మంది వైసీపీ నాయకులు, అభిమానులు పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సమక్షంలో శనివారం టీడీపీలో చేరారు. వైసీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు చింతాడ చిన్నా, అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన దళితులకు గిడ్డి ఈశ్వరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మన బతుకులు బాగుపడాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా ఈశ్వరి తెలిపారు.

- వార్త 6వ పేజీలో..



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన చింతపల్లిలోని అంబేడ్కర్ కాలనీ దళితులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



లంబసింగిలో మంచు

జి.మాడుగుల @ 9.7

మన్యంలో కొనసాగుతున్న చలి తీవ్రత

పాడేరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మన్యంలో చలి తీవ్రత కొనసాగుతున్నది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం స్థిరంగా కొనసాగుతున్నాయి. దీంతో పొగమంచు సైతం దట్టంగానే కమ్ముకుంటున్నది. జి.మాడుగులలో 9.7, ముంచంగిపుట్టులో 11.2, అరకులోయలో 12.1, జీకేవీధిలో 12.3, పెదబయలులో 12.9, పాడేరులో 13.5, హుకుంపేటలో 14.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు శనివారం నమోదయ్యాయి. ఏజెన్సీలో మరికొన్ని రోజులు ఇదే వాతావరణం కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణశాఖ సూచిస్తున్నది. ఏజెన్సీలో తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు దట్టంగానే పొగ మంచు కమ్మేస్తుంది. దీంతో లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. మధ్యాహ్నం వేళలో ఒక మోస్తరుగా మాత్రమే ఎండ కాస్తుండగా మిలిగిన సమయాల్లో చలి ప్రభావం కొనసాగుతున్నది. దీంతో ఏజెన్సీ వాసులు చలి మంటలు కాగుతూ, ఉన్ని దుస్తులు ధరిస్తూ చలి నుంచి రక్షణ పొందుతున్నారు.



పాడేరు- జి.మాడుగుల మార్గంలో శనివారం ఉదయం పొగమంచు

చింతపల్లిలో..

చింతపల్లి: మన్యంలో 15 డిగ్రీల కంటే తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదవుతున్నాయి. శనివారం చింతపల్లిలో 14.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం వాతావరణంలో కలిగిన స్వల్ప మార్పు వల్ల మంచు ఉధృతి తగ్గినప్పటికి చలి అధికంగా వున్నది. మంచు ఉదయం ఎనిమిది గంటల వరకు దట్టంగా కురుస్తున్నది. ఉదయం, సాయంత్రం శీతలగాలులు అధికంగా వీస్తున్నాయి.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండల పరిధిలో గత రెండు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. పగలు, రాత్రి తేడా లేకుండా చలి వణికిస్తోంది. శనివారం ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. వాహనాలు హెడ్ లైట్ల వెలుతురులోనే రాకపోకలు సాగించాయి.

క్రైం... crime news

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి

» మృతుడు కాకినాడ జిల్లా వాసి


నాగేశ్వరరావు (ఫైల్)

కొయ్యూరు, జనవరి 27: మండలంలోని పెదమాకవరం గ్రామ సమీపంలో శనివారం ట్రాక్టర్ బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి కొయ్యూరు ఎస్ఐ కె.రామకృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లాలోని పెదపూడి గ్రామానికి చెందిన చిట్టూరి నాగేశ్వరరావు (50) కొయ్యూరులోని శరభన్నపాలెంలో కౌలు చేస్తున్న భూమిలో పండిన వరి గడ్డిని తీసుకువెళ్లడానికి తన కుమారుడు శ్రీనుతో కలిసి వచ్చారు. గడ్డి లోడ్ చేసుకుని శనివారం తెల్లవారు జామున వెళ్తుండగా పెద మాకవరం సమీపంలోని కొండ కాలువలో అదుపుతప్పి దూసుకుపోయారు. దీంతో ట్రాక్టర్ ఇంజన్ కింద నాగేశ్వరరావు చిక్కుకుని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కాగా, అంతవరకు ట్రాక్టర్‌పై ఉన్న శ్రీను ఎదురుగా వస్తున్న ఇతర వాహనాలు కట్టడి చేసేందుకు వంతెన ప్రారంభంలో కిందకు దిగాడు. ఆ సమయంలో ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో శ్రీనుకు ప్రమాదం తప్పింది. శ్రీను ఫిర్యాదు మేరకు కొయ్యూరు ఎస్ఐ కేసు నమోదు చేశారు. శవ పంచనామా అనంతరం పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద వార్త తెలుసుకుని భార్యతో పాటు కుటుంబీకులు తరలివచ్చి కన్నీరు మున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది.

కోడి పందాలు ఆడుతున్న ఐదుగురు అరెస్టు

సబ్బవరం, జనవరి 27: మండలంలోని ఎల్లుప్పి, నల్లరేగులపాలెం గ్రామాల్లో కోడి పందాలు ఆడుతున్న ఐదుగురుని పట్టుకొని శనివారం కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లుప్పిలో బుదిరెడ్ల మోహన్, లోకిరెడ్డి అప్పలరాజు, కొట్టాడ అప్పలరాజు వద్ద రెండు కోడి పుంజులు, రూ.400, నల్లరేగులపాలెంలో గొలగాన లోవరాజు, సత్తిబాబు వద్ద రెండు కోడి పుంజులు, రూ.400 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని తెలిపారు.

కాయిన్స్ ఆట ఆడుతున్న ముగ్గురి అరెస్టు

సబ్బవరం, జనవరి 27 : అమృతపురం శివారు సూరెడ్డిపాలెం జాతీయ రహదారి పై ఓవర్ వద్ద శనివారం సాయంత్రం కాయిన్ ఆట ఆడుతున్న ముగ్గురుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుంచి 10,400 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్టు

అనకాపల్లి టౌన్, జనవరి 27: అక్రమ మద్యం కేసులో గాంధీనగరానికి చెందిన యల్లంకి లీలామోహన గోవిందరావును శనివారం అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక మిరియాలకాలనీ మూడో వీధిలోని ఒక ఇంటిపై శుక్రవారం దాడి చేయగా 909 అనధికార మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి లీలా మోహన గోవిందరావును అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు. ఈ సరుకు ఎక్కడి నుంచి వచ్చిందో పూర్తి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం

లంకెలపాలెం, జనవరి 27: రెండు బెల్ట్ దుకాణాలపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. కన్నూరు పంచాయతీ పరిధి మడకపాలెం గ్రామానికి చెందిన కరణం పైడమ్మ పాన్‌షాప్‌లో మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్ఐ సురేశ్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. దుకాణంలో ఉన్న 4 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అరెస్టు చేశారు. అలాగే మంత్రిపాలెంలో లారీ యార్డు సమీపంలో పాన్‌షాప్‌పై పోలీసులు దాడి చేసి, 4 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పాన్‌షాపు యజమాని రాజును అరెస్టు చేశారు. ఈమేరకు కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం వ్యతిరేకం కాదు

» మంత్రి బొత్స సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, జనవరి 27: ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రైవేటు పాఠశాలలకు నష్టం కలుగజేయాలన్న ఆలోచన ఎప్పుడూ లేదన్నారు. ప్రైవేటు పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలలను నడుపుతున్నామని, అందులో ఎటువంటి దురుద్దేశం లేదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఆ సంఘం రాష్ట్ర (అపూస్మా) అధ్యక్షుడు ఎంవీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ చంద్రకళ, అపూస్మా రాష్ట్రస్థాయి కమిటీ ప్రతినిధులు బి.జనార్దనరెడ్డి, ఎ.కృష్ణారెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, ఎంవీ రావు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఎంవీవీ సత్యనారాయణ, జి.శేష గిరిరావు పాల్గొన్నారు.

హైవే పైనే వాహనాల పార్కింగ్‌తో అవస్థలు


హైవేపై ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన వాహనాలు

నక్కపల్లి, జనవరి 27: మండల కేంద్రంలో ప్రతీ శుక్రవారం జరిగే వారపు సంతకు ఎంతో గుర్తింపు వుంది. ఈ సంతలో ఎండుచేపలు, మేకలు, గొర్రెల క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. అందుకే శుక్రవారం తెల్లవారుజాము నుంచి అనేక ప్రాంతాల నుంచి అమ్మకందారులు, కొనుగోలుదారులు ఇక్కడకు వస్తుంటారు. వాహనాలను ఇష్టానుసారంగా హైవేపై నిలిపివేస్తున్నారు. ప్రతీ శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇదే పరిస్థితి నెలకొంటోంది. హైవేపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపడం వల్ల అనేక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వీటిని నిరోధించాల్సిన హైవే పెట్రోలింగ్ పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదు. హైవేపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

ఘనంగా గౌరమ్మ జాతర


గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఊరేగింపును ప్రారంభిస్తున్న కేంద్ర విజిలెన్స్ సెక్రటరీ రాజశేఖర్


ఉత్సవంలో గరగల డ్యాన్సు చేస్తున్న కళాకారులు


నవదుర్గల నాట్యం


గౌరమ్మను దర్శించుకున్న మంత్రి అమర్‌నాథ్


మాజీ మంత్రి దాడి వీరభద్రరావుని సన్మానిస్తున్న దృశ్యం


గౌరమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి కొణతాల


అమ్మవారిని దర్శించుకున్న బుద్ద నాగజగదీష్

విశాఖ ఊసే లేదు

» ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కూడా మౌనం » అభ్యర్థులపై కూడా స్పష్టత ఇవ్వని వైసీపీ అధినేత » నేతల్లో విస్మయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాబోయే ఎన్నికలకు 'సిద్ధం' అంటూ విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలస నుంచి సమరశంఖం పూరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నం గురించి గానీ, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై గానీ ఒక్క ముక్క మాట్లాడలేదు. విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటు చేస్తా, నగరానికి దసరాకు వస్తా..డిసెంబరులో వస్తా...అంటూ నాలుగేళ్లుగా ఊరింపు మాటలు చెప్పిన వైసీపీ అధినేత...ఇప్పుడు ఆ ప్రస్తావనే తేలేదు. ఉత్తరాంధ్రాను ఉద్ధరించడానికే మూడు రాజధానులు అంటూ చెప్పిన ఆయన ఆ ఉత్తరాంధ్రాకు ఏమి చేశారో కూడా చెప్పలేక పోయారు. ఈ ఐదేళ్లలో ఈ ప్రాంతానికి ఏమి చేశారో చెప్పి ఓట్లు అడుగుతారని అంతా భావించారు. చెప్పుకోవడానికి ఏమీ లేదని అనుకున్నారేమో ఆ టాపిక్ తీసుకురాలేదు. మెట్రో రైలు ప్రాజెక్టు అని చెప్పి దానికి నెల క్రితం వరకు డీపీఆర్ ఆమోదించలేదు. తీరుబడిగా ఇప్పుడు కేంద్రానికి పంపారు. భోగాపురం విమానాశ్రయానికి చంద్రబాబు శంకుస్థాపన చేస్తే...ఈయన దానికి నాలుగేళ్ల తరువాత మళ్లీ శంకుస్థాపన చేశారు. అప్పటివరకు ఏ పని



ముట్టుకోలేదు. సీఎం కాగానే కాపులుప్పాడలో హిస్టర్ పార్కుకు రూ.80 కోట్లతో శంకుస్థాపన చేశారు. దానికి ఇప్పటికీ డీపీఆర్ పూర్తికాలేదు. అదానీ డేటా సెంటర్‌కు టీడీపీ హయాంలో కేటాయించిన భూమిని అధికారంలోకి రాగానే రద్దు చేశారు. ఆ తరువాత మళ్లీ ఆయనే భూమి ఇచ్చి గత ఏడాది మే నెలలో శంకుస్థాపన చేశారు. అక్కడ ఇప్పటికీ పనులు మొదలు కాలేదు. విశాఖలోనే భారీ పెట్టుబడుల సదస్సు నిర్వహించినా విశాఖకు ఒనగూరిందేమీ లేదు. ఇక్కడ ఆయన హయాంలో చెప్పుకోదగిన అభివృద్ధి ఏమీ లేకపోవడంతో మిన్నకుండిపోయారని పార్టీ వర్గాలో గుసగుసలు వినిపించాయి.

ఇది ఎన్నికల శంఖారావం కావడంతో కనీసం జిల్లాలో పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల పేర్లు అయినా ప్రకటిస్తారని నేతలు భావించారు. భీమిలి నియోజకవర్గంలో సభ పెట్టి...పక్కనే సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నిల్చొని ఉన్నా...అక్కడి అభ్యర్థి గురించి కూడా కనీసం ప్రకటన చేయలేదు. జిల్లా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురించి ప్రస్తావన కూడా రాలేదు. ఇక విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బొత్స ఝాన్సీని నియమించారు. కనీసం ఆమెను కూడా ఈ సభలో ప్రజలకు పరిచయం చేయలేదు. ఇప్పటికే నిర్ణయించిన అభ్యర్థులను వేదికపై పరిచయం చేసి, వారిని గెలిపించాలని కోరితే బాగుండేదని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి. అయితే, ఇంకా మార్పులు జరిగే అవకాశం ఉందని, అందుకే అలాంటి ప్రయత్నం చేయలేదని సీనియర్ నాయకులు అంటున్నారు.

ఎన్నికలంటే వైసీపీ నేతలకు భయం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలంటే వైసీపీ నాయకులకు, సీఎం జగన్‌కు భయంతో వణికిపోతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓటర్లు తరిమి కొడతారనే భయంతోనే తప్పుకుంటానని జగన్‌రెడ్డి చెబుతున్నారన్నారు. వైసీపీ నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి ఏమీ లేకపోగా ప్రకృతి వనరులను దోచుకున్నారని ఆరోపించారు. మంత్రి అమర్‌నాథ్ అవినీతి, అరాచకాలను వైసీపీ అధిష్ఠానమే గుర్తించి సీటు లేకుండా చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉంటే.. ప్రస్తుత వైసీపీ అరాచక పాలనలో అన్నిరంగాలు అధోగతి పాలయ్యాయని విమర్శించారు. త్వరలో జరగబోవు ఎన్నికల కురుక్షేత్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. జిల్లాలో ఓటర్ల జాబితాలను నియోజకవర్గ ఇన్‌చార్జిల పర్యవేక్షణలో టీడీపీ బూత్


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

కమిటీ సభ్యులు పరిశీలిస్తున్నారన్నారు. గతంలో ఫిర్యాదు చేసినా తుది జాబితాలో మృతుల ఓట్లు తొలగించలేదన్నారు. దీనిపై కలెక్టర్‌కు, ఎన్నికల కమిషన్‌కు మరోసారి ఫిర్యాదు చేస్తామని జగదీశ్వరరావు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు కేకేవీఏ నారాయణరావు, సాలాపు నాయుడు, దాడి అప్పారావు, కర్రి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయొద్దు

» సీపీఎం నాయకుల డిమాండ్

పరవాడ, జనవరి 27 : తాడి గ్రామానికి ఆనుకుని ఫార్మా అదనపు ల్యాండ్ ఫిల్ ఏర్పాటును తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణతో కలిసి ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే తాడి గ్రామం తీవ్ర కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. తాడి గ్రామంతోపాటు సాలాపువానిపాలెం, లంకెలపాలెం, తానాం, పరవాడ గ్రామాల ప్రజలు కూడా కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. తాడి రెవెన్యూ పరిధి సర్వే నంబరు 116లో రూ.200 కోట్లతో అదనపు ల్యాండ్‌ఫిల్‌ను


అదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఏర్పాటు చేయడం కోసం ఈనెల 30న ప్రజాభిప్రాయ సేకరణ కూడా చేయనున్నారన్నారు. తాడి గ్రామాన్ని తరలించకుండా అదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయాలని చూడడం దుర్మార్గమన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఉన్న ల్యాండ్‌ఫిల్‌ను కూడా వారు పరిశీలించారు.

ఫిబ్రవరి 27న

మోదకొండమ్మ తీర్థం



మాడుగుల, జనవరి 27: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ తీర్థం వచ్చే నెల 27వ తేదీ మంగళవారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు అధ్యక్షతన శనివారం కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. తులసీ కల్యాణ మండపం, ఆలయం పైభాగంలో ఉన్న ఫంక్షన్ హాలు, గదులను శుభకార్యాలకు ఇచ్చేందుకు, ఆలయంలో భక్తుల రద్దీ సమయంలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో దంగేటి సూర్యారావు, శ్రీనాథ శ్రీనివాసరావుతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ ఫ్లాప్ షో

... 3వ పేజీ తరువాయి

సగం ఖాళీగా దర్శనమిచ్చింది. దీంతో వైసీపీ నాయకులు కూడా షాక్‌కు గురయ్యారు.

ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు..

సభ కోసం వైసీపీ నాయకులు వందలాది ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను ఏర్పాటుచేశారు. ప్రతి గ్రామానికి బస్సులను పంపించారు. ఇందుకోసం ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన బస్సులను వినియోగించారు. అయితే, వాహనాలు అయితే భారీగా సమీకరించారు గానీ ఆ స్థాయిలో ప్రజలను సభకు తీసుకురావడంలో నాయకులు విఫలమయ్యారు. ఒక్కో గ్రామం నుంచి కనీసం వంద మంది వచ్చేలా చూడాలంటూ సూచించారు. కానీ, ఒక్కో బస్సులో కనీసం పది నుంచి పదిహేను మంది కూడా రాలేదు. కొన్ని బస్సులు ఐదారుగురితోనే వచ్చాయంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ప్రాంగణంలోకి వెళ్లేలా పోలీసులు ఒత్తిడి

ఇక స్థానిక నాయకులు ఒత్తిడి, ఇతర కారణాలతో సభకు వచ్చిన వారిలో చాలా మంది ప్రాంగణం లోపలకు వెళ్లేందుకు ఆసక్తి చూపించలేదు. సీఎం జగన్మోహన్‌రెడ్డి 3.50 గంటల సమయంలో హెలికాప్టర్‌లో ప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికి ప్రాంగణంలో పెద్దగా జనం లేరు. వందలాది మంది జాతీయ రహదారికి ఇరువైపులా, ప్రాంగణం బయటే ఉండిపోయారు. సీఎం రావడం, ముఖ్య నాయకుల నుంచి పోలీసులకు ఆదేశాలు రావడంతో ప్రాంగణం బయట ఉన్న వారిని పోలీసులు రోప్ సహాయంతో బలవంతంగా లోపలకు పంపించారు. ప్రజలను ఎంత లోపలకు తరలించినా సభా ప్రాంగణం ఖాళీగానే కనిపించడంతో వైసీపీ ముఖ్య నాయకులకు ఏం చేయాలో పాలుపోలేదు.

స్పందన అంతంతమాత్రమే..

తొలి ఎన్నికల సభ కావడంతో సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రసంగానికి పార్టీ శ్రేణుల నుంచి గట్టి స్పందన ఉంటుందని భావించారు. అయితే మొదటి ఐదు నిమిషాలు మాత్రమే కేడర్‌లో స్పందన కనిపించింది. ఆ తరువాత సీఎం ప్రసంగిస్తున్నంత సేపు సభా ప్రాంగణం సైలెంట్‌గానే ఉంది. ప్రతిపక్షాలపై సీఎం చేసే విమర్శలకు ఆశించిన స్థాయిలో కేడర్ స్పందించలేదు.

ప్రసంగం ప్రారంభం కాకముందే బయటకు..

సీఎం జగన్మోహన్‌రెడ్డి 4.10 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించారు. అయితే, సీఎం ప్రసంగం ప్రారంభం కావడానికి ముందే వందలాది మంది కార్యకర్తలు ప్రాంగణం నుంచి బయటకు వస్తూ కనిపించారు. ప్రసంగం ప్రారంభమైన తరువాత వందలాదిగా బయటకు వచ్చేశారు. సీఎం జగన్ సుమారు రెండు గంటలపాటు ప్రసంగించారు. ఆయన సుదీర్ఘ ఉపన్యాసంపై కేడర్‌లో అసహనం కనిపించింది. దీంతో చాలామంది బయటకు వెళ్లేందుకు యత్నించారు.

కేడర్‌తో మాటామంతీ ఏదీ..?

సంగివలస సభలో కేడర్‌తో సీఎం జగన్మోహన్‌రెడ్డి మాటామంతీ ఉంటుందని వైసీపీ నాయకులు చెప్పారు. కానీ, సభలో సీఎం సుదీర్ఘ ప్రసంగానికి ప్రాధాన్యం ఇచ్చారు గానీ కేడర్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. సీఎంతో మాట్లాడాలని భావించిన వందలాది మంది కార్యకర్తలను ఇది అసంతృప్తికి గురిచేసింది. అయితే క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులు, అసంతృప్తులు బయటపడతాయన్న ఉద్దేశంతోనే మాటామంతీకి సీఎం దూరంగా ఉండిపోయారని అంటున్నారు.

సెర్ప్ ఉద్యోగుల సమ్మె బాట


» నెహ్రూచౌక్‌లో ధర్నా


శిబిరంలో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, జనవరి 27: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. తమ న్యాయమైన డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద శనివారం ధర్నా చేపట్టారు. సెర్ప్ సంస్థను ప్రభుత్వ సంస్థగా గుర్తించి పనిచేస్తున్న ఉద్యోగులకు కేడర్ ఫిక్స్ చేస్తూ పే స్కేల్ అమలు చేసి సర్వీస్ రెగ్యులర్ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సర్వీస్ క్రమబద్ధీకరణకు ఆర్థిక శాఖ ద్వారా పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ పరిధిలో శాంక్షన్ పోస్టులుగా గుర్తిస్తూ ఇచ్చిన ఆదేశాలు సర్క్యులర్ మెమోపై తగు జీవో ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఉన్ననట్టువంటి ఈపీఎఫ్ సీలింగ్ విధానం తీసివేసి మూలవేతనంపై వంద శాతం ఈపీఎఫ్‌ను అమలు చేయాలన్నారు. సెర్ప్ హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్లు వర్తింపజేస్తూ అర్హులైన ఉద్యోగులందరికీ ప్రమోషన్లు కల్పించాలని, పదవీవిరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు నానిబాబు, శ్రీనులతో పాటు ఉద్యోగులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

అల్లరి నరేశ్ హీరోగా యాక్షన్ చిత్రం

» ఫిబ్రవరి మూడో వారం నుంచి ఉపమాకలో షూటింగ్
» బచ్చలమల్లి సినిమా దర్శకుడు బి. సుబ్బు


ఉపమాక ఆలయం, పరిసరాలను పరిశీలిస్తున్న దర్శకుడు సుబ్బు తదితరులు

నక్కపల్లి, జనవరి 27: హాస్య మూవీస్ బ్యానర్‌పై అల్లరి నరేశ్ హీరోగా నిర్మితమవుతున్న బచ్చలమల్లి చిత్రం రెండో షెడ్యూల్ ఫిబ్రవరి మూడో వారం నుంచి నక్కపల్లి, ఉపమాక పరిసర ప్రాంతాల్లో జరుగుతుందని దర్శకుడు బి.సుబ్బు చెప్పారు. శనివారం బచ్చలమల్లి చిత్రం టెక్నికల్ సిబ్బందితో కలిసి నక్కపల్లి, ఉపమాక, రాజయ్యపేట ప్రాంతాలను దర్శకుడు సుబ్బు పరిశీలించారు. రాజేశ్ దండా నిర్మాతగా ఈ చిత్ర నిర్మాణం జరుగుతోందని, ఇప్పటికే మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తయిందని సుబ్బు చెప్పారు. పూర్తి యాక్షన్ మూవీగా ఈ చిత్రం వుంటుందన్నారు. ఉపమాక ఆలయ పరిసర ప్రాంతాలు, నక్కపల్లి నూకాలమ్మ ఆలయం వద్ద భక్తి సన్నివేశాలను చిత్రీకరించేందుకు ఇక్కడ వాతావరణం అనువుగా వుందన్నారు. రెండేళ్ల కిందట సాయి ధరమ్‌తేజ హీరోగా సోలో బ్రతుకే సో బెటర్ సినిమా సుబ్బు దర్శకత్వంలో విడుదలైంది. ఈ చిత్రాన్ని దసరా నాటికి విడుదల చేస్తామని చెప్పారు. రిజర్వ్ నాథన్ కెమెరామన్‌గా అద్భుత చిత్రీకరణ జరుగుతుందన్నారు. తన పూర్వీకులది ఉపమాక గ్రామం కావడంతో ఇక్కడ సినిమా షూటింగ్ జరపాలన్న తన చిరకాల వాంఛ నెరవేరుతున్నందుకు చాలా సంతోషంగా వుందని దర్శకుడు సుబ్బు చెప్పారు.

ఒక్క ఛాన్స్ అంటే నమ్మి మోసపోయాం

- ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశారు
- చంద్రబాబునాయుడుతోనే పేదల బతుకుల బాగు
- టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి
- 200 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, జనవరి 27: ఒక్క ఛాన్స్ అంటూ జగన్ ప్రాథేయపడితే నమ్మి వైసీపీకి ఓటు వేసి మోసపోయామని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. అందరి బతుకులు బాగుపడాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కాలనీలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో గిడ్డి ఈశ్వరి మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక గిరిజనులు, దళితులు, బీసీలు, బలహీన వర్గాల అభివృద్ధిని జగన్ పూర్తిగా విస్మరించారన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి గాలికొదిలేశారన్నారు. అంబేడ్కర్ కాలనీలో నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సీసీ రోడ్లు, మంచినీటి పథకం తప్పితే, వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క అభివృద్ధి పనైనా చేశారా? అని ఆమె ప్రశ్నించారు. ఏనాడైనా వైసీపీ నాయకులు అంబేడ్కర్ కాలనీకి వచ్చి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారా? అన్నారు. అధికారంలోకి వస్తే గిరిజనులకు 45 ఏళ్లకే పింఛన్ ఇస్తానని చెప్పి మాటమార్చేశారన్నారు. అలాగే బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంతో పాటూ టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి 15 రకాల పథకాలను రద్దుచేసిన ఘనత జగన్‌దేనని ఆమె పేర్కొన్నారు. చింతపల్లి వచ్చిన సీఎం జగన్ ఆదివాసీ సమస్యలపై ఒక్క మాటైన మాట్లాడారా? అని ప్రశ్నించారు. జీవో నంబరు-3, బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం, యర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టుపై కనీసం నోరు విప్పలేదన్నారు. దీనికి ఫలితమే నేడు భీమిలీలో నిర్వహించే సభకు వచ్చేదేలేదని వైసీపీ అభిమానులు సైతం వెళ్లకుండా గ్రామాల్లో ఉండిపోయారన్నారు. అరకువేలి వచ్చిన చంద్రబాబు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో నంబరు-3 పునరుద్ధరిస్తామని, పవర్ ప్రాజెక్టుల జోలికి వెళ్లబోనని హామీ ఇచ్చార న్నారు. చంద్రబాబు ప్రకటించిన పథకాలు ప్రజలకు పూర్తి స్థాయిలో అందాలంటే అందరూ సైకిల్ గుర్తుపై ఓటేసి టీడీపీ విజయానికి కృషి చేయాలని ఆమె కోరారు.

టీడీపీలోకి 200 మంది వైసీపీ కార్యకర్తలు

స్థానిక అంబేడ్కర్ (ఎస్సీ) కాలనీలో 200 మంది వైసీపీ కార్యకర్తలు, అభిమానులు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చింతాడ చిన్న, అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన స్థానిక దళితులకు ఆమె కండువాలు వేసి స్వాగతం పలికారు. వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అంబేడ్కర్ కాలనీ దళితులను భయపెట్టినా, అక్రమ కేసులు పెట్టినా టీడీపీ సైన్యం చూస్తూ ఊరుకోదని ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు రాజమండ్రి నారాయణరావు, అరకు పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలుపర్తి గోవిందరావు, నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, సేవా ఈశ్వరమ్మ, ఎ.లక్ష్మణ్, పాంగి రాము, సరమండ శ్రీధర్, సోమేశ్, భూషణం దేవరాపల్లి సర్పంచ్ బుజ్జిబాబు, పాల్గొన్నారు.

బాబును గెలిపిద్దాం.. భవిష్యత్‌ను కాపాడదాం

పాడేరు రూరల్: రానున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబును గెలిపించుకుని భవిష్యత్‌ను కాపాడదామని పార్టీ నాయకుడు కొట్టగుళ్లి సుబ్బారావు కోరారు. బడిమెల, గొండెలి పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో శనివారం బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అమలుచేసే ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. అలాగే భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో కుటుంబాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వేసిన రహదారులకు జగన్ ప్రభుత్వం మరమ్మతులు కూడా చేయించలేదన్నారు. జగన్ ప్రజా వ్యతిరేక పాలనతో విసుగు చెందిన రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వర్తన పిన్నయ్యదొర, నాగబ్బాయి, నారాయణరావు, బడిమెల సర్పంచ్ సావిత్రమ్మ, మత్స్యరాజు, బొడ్డేటి ఆనందరావు, కించే నారాయణ, కిముడు ప్రకాష్, కించే రమణ పాల్గొన్నారు.

టీడీపీ లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి: దాక్షాయిని

గూడెంకొత్తవీధి: టీడీపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పార్టీ నేత కొట్టగుళ్లి దాక్షాయిని కోరారు. రంపుల, చాపరాతిపాలెం గ్రామాల్లో కార్యకర్తలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో గిరిజన గ్రామాలు అభివృద్ధిలో పదేళ్లు వెనక్కి వెళ్లిపోయాయన్నారు. ప్రస్తుతం గిరిజన ప్రజలు రహదారులు, తాగునీరు, ఇతర సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆదివాసీలకు అపారమైన నష్టం జరిగిందన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేత పడాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.


శిబిరం ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్.. రక్తదానం చేస్తున్న పీవో అభిషేక్

రక్తదానం ప్రాణదానంతో సమానం

- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాపాయంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడడానికి దానం చేసిన రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అందువల్ల రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో పెరుగుతున్న అవసరాల నిమిత్తం మరింతగా రక్త నిల్వలు అవసరమని చెప్పారు.

ఐటీడీఏ పీవో అభిషేక్ రక్తదానం

కలెక్టరేట్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడానికి ప్రజలు ముందుకు రావాలని ఆయన కోరారు. మండల కేంద్రాలు, సచివాలయాల పరిధిలో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని రెడ్‌క్రాస్ సిబ్బందికి పీవో సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వీవీ.రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.మురళీకృష్ణ, కలెక్టరేట్ తహసీల్దార్ సిహెచ్.చిన్నికృష్ణ, డాక్టర్ రాజీవ్, రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వకర్త లోహితాస్, సభ్యుడు పి.సూర్యారావు, ఎస్ఎస్ఎస్ పీవో గౌరీశంకరరావు పాల్గొన్నారు.

లేబర్ సెస్‌ను విధిగా వసూలు చేయాలి

- అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం


అధికారులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పాడేరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు భవన నిర్మాణాలు జరిగే క్రమంలో ఆయా యజమానుల నుంచి విధిగా ఒక శాతం లేబర్ సెస్‌ను వసూలు చేయాలని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. లేబర్ సెస్‌పై ఆయా శాఖలకు చెందిన అధికారులు, లేబర్ వెల్ఫేర్ బోర్డు సభ్యులతో ఆయన శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భవన నిర్మాణాలు చేపట్టే వారి నుంచి మార్కెట్ ధర ప్రకారం ఒక శాతం లేబర్ సెస్‌ను వసూలు చేసి లేబర్ వెల్ఫేర్ బోర్డుకు జమ చేయాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో భవన నిర్మాణాలు చేపడుతున్న యజమానులకు దీనిపై అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఆయా ఇంజనీరింగ్ అధికారులు కేటాయించిన లేబర్ సెస్ స్థితిగతులపై ఆయన ఆరా తీశారు. పెండింగ్‌లో వున్న లేబర్ సెస్‌ను చెల్లించాలని కోరుతూ ఇంజనీరింగ్ అధికారులకు లేఖలు రాయాలని కార్మిక శాఖాధికారులకు కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనులు చేపడుతున్న ఇంజనీరింగ్ అధికారులు ఆయా వివరాలను ప్రతి నెలా తమకు నివేదించాలని విశాఖపట్నం డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎం.సునీత సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సూర్యనారాయణ, పంచాయతీరాజ్ శాఖ ఈఈ టి.కొండయ్యపడాల్, డీఎల్‌పీవో కుమార్, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గిరిజనేతర విలేకర్ల ఇళ్ల స్థలాల సమస్యపై కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విలేకరులు

పాడేరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజనేతర విలేకరుల ఇళ్ల స్థలాల కేటాయింపు సమస్యపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఏపీయూడబ్ల్యూజే నాయకులు శనివారం వినతిపత్రం సమర్పించారు. అక్రిడేషన్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇచ్చేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికీ, 1/70 చట్టం కారణంగా గిరిజనేతర విలేకరులకు అల్లూరి జిల్లా పరిధిలో ఇళ్ల స్థలాల కేటాయింపునకు అవకాశం లేదు. దీంతో తమకు మైదాన ప్రాంతంలో ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను విలేకరులు కోరారు. జిల్లాలో అక్రిడేషన్ కలిగిన విలేకరులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు చేపడతామని, గిరిజనేతర విలేకరులకు మైదాన ప్రాంతాలైన వి.మాడుగుల, అనకాపల్లి ప్రాంతాల్లో ఇచ్చేలా చర్యలు చేపట్టేందుకు నిర్ణయించామని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడేరు, అరకులోయ ప్రెస్‌క్లబ్ విలేకరులు పాల్గొన్నారు.

‘పల్లెకు పోదాం’కు తరలిరండి

- బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి ఎన్.మధుకర్


బీజేపీ జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మధుకర్

పాడేరు రూరల్, జనవరి 27: ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు చేపట్టే పల్లెకు పోదాం.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి ఎన్.మధుకర్ పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు అధ్యక్షతన స్థానిక పీఎంఆర్సీ భవనంలో శుక్రవారం నిర్వహించిన పల్లెకు పోదాం..! జిల్లా స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రెండు నెలలు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉండాలని కోరారు. గిరిజన గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీకి బలంలేని గ్రామాల్లో పార్టీ నాయకులు 24 గంటలు ప్రజల మధ్యనే ఉండి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. 2024 ఎన్నికల్లో మూడోసారి బీజేపీ అధికారంలోకి రానుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, బీజేపీ జాతీయ గిరిజన మోర్చ ఉపాధ్యక్షుడు కేవీవీ.సత్యనారాయణ, గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కురసా రాజారావు, మఠం శాంతకుమారి, మైనార్టీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్, జిల్లా ఇన్‌చార్జి పెనుమత్స పరశురామరాజు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్‌లు, జిల్లా మండల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రలో క్రీడాకారుల ఆకలి కేకలు

- సీపీఐ జిల్లా నాయకుడు అమర్


విలేకరులతో మాట్లాడుతున్న అమర్

పాడేరు రూరల్, జనవరి 27: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సచివాలయాల నుంచి తీసుకువచ్చిన క్రీడాకారులు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆకలి కేకలతో అల్లాడుతున్నారని సీపీఐ జిల్లా నాయకులు అమర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం జరుగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల సమయం ఆసన్నం కావడంతో పోరాట ప్రతిమ గల యువతను దారి మళ్లించేందుకు, గిరిజన నిరుద్యోగ యువత ప్రభుత్వ తీరుపై ఉద్యమ బాట పట్టకుండా సీఎం జగన్ ఆడుదాం ఆంధ్ర క్రీడలను ఏర్పాటు చేశారని ఆరోపించారు. సచివాలయ పరిధిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జిల్లా కేంద్రానికి రప్పించిన అధికారులు వారికి కనీసం భోజనం, రవాణా చార్జీలను కూడా అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నార న్నారు. యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడలు ఎంతగానో దోహదపడతాయని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే క్రీడాకారులకు కనీస వసతులు కల్పించకపోవడం విచారకమన్నారు. ఆడపిల్లలు ఆడుతున్న క్రీడా ప్రాంగణంలో కనీసం టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయకపోవడం అధికారుల, ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. అధికారులు తక్షణమే స్పందించి క్రీడా మైదానంలో సౌకర్యాలు మెరుగుపర్చడంతో పాటు పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలి

- సీబీఎన్ ఫోరం అధ్యక్షురాలు సుమిత


చింతపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న సీబీఎన్ ఫోరం అధ్యక్షురాలు సుమిత,

చింతపల్లి, జనవరి 27: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే విజనరీ నాయకుడు, టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని సీబీఎన్ ఫోరం అధ్యక్షురాలు సుమిత అన్నారు. హైదరాబాద్‌కు చెందిన సీబీఎన్ ఫోరం సభ్యులు (సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు) శనివారం మండల కేంద్రంలో పర్యటించారు. రామాలయం, తపాలపేట, ఎస్సీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షురాలు మాట్లాడుతూ చంద్రబాబు గొప్ప రాజకీయవేత్త అన్నారు. చంద్రబాబు హయంలో రాష్ట్రానికి ఎన్నో పెట్టుబడులు వచ్చాయని, వైసీపీ పాలనలో కంపెనీలు వెనక్కి వెళ్లిపోయాయని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా నడిపించ గల సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో మార్పు కావాలంటే చంద్రబాబుకు పగ్గాలు కట్టబెట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒకరూ టీడీపీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీబీఎన్ ఫోరం ప్రధాన కార్యదర్శి జెనెక్స్ అమర్, సభ్యులు శైలజ, మానస, సుమన్, విజయలక్ష్మి, మురళీకృష్ణ, టీడీపీ అరకులోయ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సన్యాసిదొరకు ఘన నివాళులు


పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పెదబయలు, జనవరి 27: అకాల మరణం చెందిన కానిస్టేబుల్ కించేయి సన్యాసిదొరకు శనివారం పోలీసులు ఘనంగా నివాళులర్పించారు. సన్యాసిదొర హఠాన్మరణం పోలీసు విభాగానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. మృతుని స్వగ్రామమైన లక్ష్మీపేట పంచాయతీ మండిభ గ్రామానికి పోలీసులు చేరుకొని అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 2009లో ఉమ్మడి విశాఖ జిల్లాలో కానిస్టేబుల్‌గా చేరి తోటి సిబ్బందితో సఖ్యతగా వెలుగుతూ ఉన్నతాధికారుల మన్ననలు పొందేవారని ఈ సందర్భంగా వారు వాపోయారు. దురదృష్టవశాత్తు శుక్రవారం విధి నిర్వహణలో ఉండగా ఆకస్మికంగా గుండెపోటు సంభవించి మరణించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎలక్ట్రీషియన్ల ర్యాలీ

పాడేరు రూరల్, జనవరి 27: జిల్లా కేంద్రం పాడేరులో మోద ఉమానీలకంటేశ్వర ఎలక్ట్రీషియన్లు శనివారం ర్యాలీ చేశారు. ఎలక్ట్రీషయన్ డే సందర్భంగా ముందుగా యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు ఆధ్వర్యంలో యూనియన్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం సీనియర్ ఎలక్ట్రీషయన్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అనీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి దామోదరం, సభ్యులు పాల్గొన్నారు.


పాడేరు రహదారిపై ర్యాలీ చేస్తున్న ఎలక్ట్రీషియన్లు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లి, జనవరి 26: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న మూడు అంగన్‌వాడీ ఉద్యోగాలకు అర్హులైన స్థానిక మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో బీవీ రమణ తెలిపారు. మండలంలోని చిట్రాళ్లగొప్పు (లంబసింగి)లో అంగన్‌వాడీ కార్యకర్త, పెద అంతర్ల (చింతపల్లి)లో మినీ అంగన్‌వాడీ కార్యకర్త, చెరువువీధి (తాజంగి)లో హెల్పర్ ఉద్యోగాలు ఖాళీగా వున్నాయన్నారు. స్థానిక గ్రామానికి చెందిన 21-35ఏళ్ల వయస్సు కలిగిన ఆదివాసీ మహిళలు అర్హులని చెప్పారు. అలాగే పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ప్రీ స్కూల్ శిక్షణ, ఇంటర్మీడియేట్ అర్హతలు, వితంతువు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా దరఖాస్తులను ప్రాజెక్టు సీడీపీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

గూడెంకొత్తవీధిలో...

గూడెంకొత్తవీధి: ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా మినీ అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టులకు అర్హులైన గిరిజన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాసు చేసుకోవాలని సీడీపీవో ఎ.లక్ష్మీదేవి తెలిపారు. మండలంలోని రాళ్లగెడ్డ (దుప్పులవాడ)లో మినీ అంగన్‌వాడీ కార్యకర్త, ఎర్రచెరువులు (లక్కవరపుపేట)లో సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు వచ్చే నెల 10తేదీ సాయంత్రం ఐదు గంటలులోపు సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

కొయ్యూరులో...

కొయ్యూరు: మండలంలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు మూడు ఆయా పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. కినపర్తి పంచాయతీ భీమవరం మినీ అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు మూలపేట పంచాయతీ మర్రిపాలెం, మఠం భీమవరం పంచాయతీ జెర్రిగొంది, మంప పంచాయతీ ఆర్.దొడ్డవరం అంగన్‌వాడీ కేంద్రాలలో ఆయా పోస్టులు భర్తీ చేయనున్నట్టు ఆమె చెప్పారు.

సంక్షిప్తంగా..

గ్యాస్ సిలిండర్లపై అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు: జేసీ కార్తిక్

పాడేరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన ధరల కంటే గ్యాస్ సిలిండర్లపై వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ కె.కార్తిక్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలోని పలువురు డీలర్లు గ్యాస్ సిలిండర్లపై అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. గ్యాస్ కంపెనీలు నిర్దేశించిన ధరల కంటే అధికంగా వసూలు చేయవద్దని డీలర్లకు సూచించారు. ఎవరైనా అధిక ధరలు వసూలు చేస్తే టోల్ ఫ్రీ నంబర్లు 1967 లేదా 18002333555కు ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

గోడ్వానా దండకారణ్య పార్టీ అరకు ఇన్‌చార్జిగా రాజబాబు



పాడేరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గోడ్వానా దండకారణ్య పార్టీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా హుకుంపేట మండలానికి చెందిన చుంచు రాజబాబును నియమించామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోడే వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చుంచు రాజబాబు తమ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా పని చేస్తారని, పార్టీని విశాఖ మన్యం ప్రాంతంలో బలోపేతం చేసేందుకు గానూ ఆయన్ని అరకులోయ ఇన్‌చార్జిగా నియమించామన్నారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రాజబాబు ఈసందర్భంగా పేర్కొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు

- ప్రత్యేకాధికారి వినోద్‌బాబు



డుంబ్రిగుడ, జనవరి 27: మార్చిలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఇంటర్మీడియట్ పరీక్షల ప్రత్యేకాధికారి వినోద్‌బాబు చెప్పారు. జూనియర్ కళాశాలను శనివారం సందర్శించిన ఆయన ,పరీక్షల ఏర్పాట్లకు తగిన సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 11 మండలాలు, ఉమ్మడి విశాఖ జిల్లాలో తొమ్మిది మండలాలను కలుపుకుని 20 మండలాల్లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యా శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక అధికారిగా తనను నియమించారన్నారు. ఇందులో భాగంగా ఆయా మండలాల్లోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సదుపాయాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఆదివాసీలపై కాల్పులకు తెగబడిన వారిపై చర్యలు చేపట్టాలి’

పాడేరు రూరల్, జనవరి 27: అరకులోయ మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ బంగ్లావలస గ్రామ ఆదివాసీలపై ఎయిర్ గన్‌తో కాల్పులకు తెగబడుతున్న కార్తీక్ రాజాకిరణ్, సంజీవ్ ప్రసాద్‌లపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర డిమాండ్ చేశారు. ఈ ఘటనపై శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం నుంచి జీవనోపాధికి వచ్చిన గిరిజనేతరులైన కార్తీక్ రాజాకిరణ్, సంజీవ్ ప్రసాద్ ఎస్టీ నూకదొరగా తప్పుడు కుల ధ్రువపత్రాన్ని సంపాదించి గిరిజన హక్కులైన విద్య, ఉద్యోగ, రాజకీయ పదవులను అనుభవిస్తున్నారన్నారని ఆరోపించారు. అంతటితో ఆగని వారు సుంకరమెట్ట, బంగ్లావలస, జడ్డిపనస, చిన్నగంగుడి గ్రామాల గిరిజనుల భూములు, గృహాలను ఆక్రమించేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా కాల్పులకు తెగబడి ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. ఈ నెల 8న గొల్లోరి భవాని అనే మహిళపై ఎయిర్ గన్‌తో కాల్పులు జరిపినట్టు వివరించగా, కలెక్టర్ తక్షణమే స్పందించి విచారణకు పీవో వి.అభిషేక్‌ను ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎం.రాజబాబు, జి.బాలకృష్ణ, పి.అంజిరావు, కె.చిట్టిబాబు, పి.రాజారావు, కె.రాంబాబు పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీ ప్రథమ బీఏ విద్యార్థులకు కౌన్సెలింగ్ తరగతులు

పాడేరు రూరల్, జనవరి 27: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో 2023 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ పొందిన బీఏ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఆదివారం నుంచి సెమిస్టర్-1 కౌన్సెలింగ్ తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ వి.చిట్టబ్బాయి తెలిపారు. వచ్చే నెల 4, 11, 25, మార్చి 3వ తేదీలలో తరగతులు జరుగుతాయన్నారు. అలాగే ద్వితీయ సంవత్సర విద్యార్థులు ట్యూషన్ ఫీజు, 3, 5 సెమిస్టర్ పరీక్ష ఫీజులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలని అధ్యయన కేంద్రంకో-ఆర్డినేటర్ ఎ.మురళీధరరావు తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సర బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపుల్లో అడ్మిషన్‌లు కోరుకొనే విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోగా వెబ్‌సైట్‌లో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించాలని చెప్పారు. పూర్తి వివరాల కోసం 9490458695, 7382929728 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎంపీడీవో ఆశాజ్యోతి బదిలీ

చింతపల్లి, జనవరి 27: ఎంపీడీవో పి.ఆశాజ్యోతి తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెండేళ్ల పైబడి ఒకే ప్రాంతంలో పని చేస్తున్న ఎంపీడీవోలను బదిలీలు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశాయి. ఈ మేరకు ఎంపీడీవో ఆశాజ్యోతిని బదిలీ చేశారు. కాగా, చింతపల్లికి మాత్రం కొత్తగా ఎంపీడీవోను నియమించలేదు.

గిరిజనుల పొట్టకొట్టే వ్యాఖ్యలు సరికాదు

పెదబయలు, జనవరి 27: ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టాలని ఎంపీపీ వరహాలమ్మ ప్రకటన చేయడం ఎంతవరకు సమంజసమని ఆదివాసీ వర్తకుల సేవా సంఘం అధ్యక్షుడు పల్టాసింగి భాస్కరరావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ప్రజలకు సంక్షేమ పాలన అందించాల్సింది పోయి ప్రధాన రహదారికి ఆనుకుని ఆర్‌అండ్‌బీ భూమిలో విస్తరణ పనులు చేపట్టాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకురావడం వెనుక ఆంతర్యం ఏమిటని మండిపడ్డారు. 50 అడుగుల మేర విస్తరణ జరపాలని చెప్పటం భావ్యం కాదన్నారు. ఇదే జరిగితే దుకాణ సముదాయాలు నేల మట్టమై యజమానులు, వర్తకుల కుటుంబాలు రోడ్డున పడాల్సిన దుస్థితి దాపురిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.